క్లుప్తంగా

ఘనంగా పండిత సన్మానం

రాజాం: మారేడుబాక గ్రామంలో పండిత సన్మాన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన జాడ బాల చంద్రమౌళీశ్వరరావుశర్మ దంపతులను సత్కరించారు. రాజాం పట్టణానికి చెందిన కల్కి జ్యూయలరీ షోరూమ్ సింహతలాటాన్ని అందజేసింది. గ్రామస్తులు, పలువురు వ్యాపారవేత్తలు ఆయనకి జ్ఞాపికలు బహుకరించారు.

రాజు మాస్టారుకు ఎన్టీఆర్ పురస్కారం

బొబ్బిలి: స్థానిక రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్, కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసీ రాజు మాస్టారు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి విజయవాడకు చెందిన ఎక్స్‌రే సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఎన్టీఆర్ స్మారక అవార్డులను ఆదివారం ప్రదానం చేసింది. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా జేసీ రాజు అవార్డు అందుకున్నారు.

ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయరూ..

వంగర: మెట్టమగ్గూరు గ్రామంలో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఆ గ్రామంలో మహిళలు నిరసన తెలిపారు. వీధి కుళాయిలు తగినన్ని లేకపోవడంతో తాగు నీటికోసం తగాదాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

రేగిడి: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి అంతా కలిసి కృషి చేద్దామని స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ ముప్పుపై మండలంలోని బూరాడ గ్రామస్తులకు ఆదివారం ఆమె అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణ కాలుష్యమవుతుందని అన్నారు. జూన్5న పర్యా వరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఎంపీడీఓ శ్యామలాకుమారి ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

బొబ్బిలి: మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇందుకోసం జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిద్దామని మాజీ సైనికుల సంఘ గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు, అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మాజీసైనికుల సంఘ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడానికి గల కారణాలు పరస్పరం చర్చించుకుని హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఆర్.మోహన్‌రావు, ట్రెజరర్ వి.ఎస్.శర్మ పాల్గొన్నారు.

మత్తుకు బానిసకావద్దు

రాజాం సిటీ: యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై రాజాం మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామస్తులకు ఆదివారం అవగాహన కల్పించారు. యువత మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా పెద్దలు అడ్డుచెప్పాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్‌లకు తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని చెప్పారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతోనే సాధ్యమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఆదివారం మొక్కలు నాటారు. ఈనెల 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాలతో పాటు చెరువుగట్లపై మొక్కలు నాటాలని కోరారు.

కూటమి తెచ్చిన కోటా కష్టాలు...





క్యూలో రేషన్ తీసుకుంటున్న వృద్ధురాలు సీతమ్మ

" నా పేరు సీతమ్మ నాయనా..! మాది బొబ్బిలినాలుగో వార్డు. ఇంత వరకూ మా ఇంటి వద్దకే రేషన్ బండి వచ్చేది. ఈ నెల నుంచి రేషన్ దుకాణానికే ఎల్లి తీసుకోవాలట..! ముసలోళ్లకి ఇంటికి తెచ్చి ఇస్తారనుకున్నాను. కానీ ఇవ్వలేదు. ఇదుగో ఎండలో ఇలా వచ్చి లైనులో ఉండలేక పక్కనే కూకున్నాను. నా వరుస వచ్చేసరికి ఎల్లి బియ్యం ఒట్టుకెళిపోతాను".



రామభద్రపురం మండల కేంద్రం లోని అగురు వీధి రేషన్ షాపులో రేషన్ సరుకులు విడిపించుకుని ఎండలో తలపై మోసుకుంటూ వెళుతున్న ఈ వృద్ధురాలి పేరు ముగడ అప్పమ్మ(72). వృద్ధులకు సరుకులు ఇంటికే తీసుకెళతామని కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. కానీ అమలులో మాత్రం ఎక్కడా కనిపించడం లేదని స్థానికులు మండి పడుతున్నారు.



ఈ చిత్రంలో భుజంపై బియ్యం మూటతో వెళ్తున్న మహిళది బొబ్బిలి దావాల వీధి. గతంలో ఇంటి వద్దకు వాహనం వచ్చి సరుకులు ఇచ్చేవారని, ఇప్పుడు దూరంగా ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఈమె ఆవేదన చెందింది. వయసు సహకరించకపోయినా మూట మోసుకెళ్తోంది.

- ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి తిలోదకాలు
- మళ్లీ పడిగాపులు, మోత తప్పని వైనం
- రేషన్ డిపోలకు ఎండలో వచ్చి క్యూలో నిలబడలేక అవస్థలు
- సర్వర్లు పనిచేయక ఇక్కట్లు
- వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు పంపిస్తామన్నది వట్టిమాటే



వంగర మండల కేంద్రంలోని రేషన్ డిపో వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు



రామభద్రపురంలో సర్వర్ పనిచేయక డిపో ఎదుట ఓ ఇంటి గడపలో కూర్చొని నిరీక్షిస్తున్న మహిళలు

బొబ్బిలి/రాజాం:

ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వ పాలన సాగు తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయడం మానేసి ఏకంగా ప్రజలకు కష్టాలు తెచ్చిపెడుతోంది. ప్రజలు రేషన్ సరుకుల కోసం రేషన్ దుకాణాల వద్ద గంటల పాటు పడిగాపులు కాయకూడదని, రేషన్ దుకాణాలకు దూరంగా ఉన్న గ్రామాల వారు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని తీసుకువచ్చింది. ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) వాహనాల ద్వారా ప్రతీ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీలోగా ఇంటి ముంగిటకే రేషన్ సరుకులు అందించే వారు. కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఈనెల ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి సరుకులు విడిపించుకోవాలని జీవో జారీ చేసి అమలులోకి తెచ్చింది. దీంతో ప్రజలకు గతంలో మాదిరిగా రేషన్ కష్టాలు ఆదివారం నుంచి మళ్లీ మొదలయ్యాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలో 425 రేషన్ దుకాణాలు న్నాయి. ఈ దుకాణాల పరిధిలో 3లక్షల16 వేల 619 మంది లబ్ధిదారులున్నారు. వీరికి గతంలో మండలాల వారీగా ఉన్న రేషన్ వాహనాల ద్వారా సరుకులు వారి ఇంటి ముందర ఇచ్చేవారు. ఇప్పు డు మళ్లీ పాత పద్ధతిలోనే రేషన్ షాపులకు వెళ్లి డీల ర్ వద్ద వేలిముద్ర వేసి సరుకులు తీసుకోవాల్సిందే.

గంటల తరబడి నిరీక్షణ..!

రెవెన్యూశాఖ వెయిటేజ్ మెషిన్లతో సంబంధం లేకుండా ఇష్టానుసారం రేషన్ పంపిణీకి ఆదేశాలు జారీచేసింది. దీంతో చాలా మంది డీలర్లు తమకు నచ్చిన కాటాల తో సరుకులు తూకం వేసి పంపిణీ చేశారు. గతంలో ఇలా కాకుండా లబ్ధిదారునికి రావాల్సిన బియ్యం వెయిటేజ్ పక్కాగా సరిపోతేనే బయోమెట్రిక్ అప్డేట్ అయ్యేది. ప్రస్తుతం డీలర్ల వద్ద సరుకుల వెయిటేజ్‌తో సంబంధం లేకుండానే బయోమెట్రిక్ అయిపోతుండడం వల్ల పలుచోట్ల పంపిణీ అస్తవ్యస్తంగా కనిపించింది. రేషన్ దుకాణాలను ప్రారంభించిన తొలిరోజు సర్వర్ లోడెక్కువయ్యి మొరాయించింది. దీంతో జనం అవస్థలు పడ్డారు. పలు డిపోలు వద్ద సర్వర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు గంటల తరబడి క్యూలో నిరీక్షించారు.మరికొన్నిచోట్ల ఇదే అదునుగా డీలర్లు సర్వర్లు పనిచేయలేదని చెప్పి ఉదయం రేషన్‌కు వచ్చినవారికి సరుకులు ఇచ్చి మధ్యాహ్నం సరుకులు పంపిణీ నిలుపుదలచేసేశారు. ఇంకొన్నిచోట్ల ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లి లబ్ధిదారులు రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి కనిపించింది. సంతకవిటి మండలంలో మొత్తం 62 రేషన్ డిపోలు ఉన్నాయి. ఈ డిపోల్లో 12 చోట్ల ఒక గ్రామం నుంచి లబ్ధిదారులు మరో గ్రామానికి వెళ్లి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది.ఈ మండలంలో చాలా డిపోల్లో ఆదివారం సరుకులు పంపిణీచేయలేదు. సర్వర్ డౌన్ కారణంగా ఒక్కో డిపో వద్ద 30 మందికి మించి సరుకుల పంపిణీ జరుగలేదు. తెర్లాం మండలంలో పలు గ్రామాల్లో రేషన్ పంపిణీ ప్రారంభం కాలేదు.



సంతకవిటి మండలం కృష్ణంవలసలో రేషన్ సరుకుల నిమిత్తం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



బొబ్బిలి: బాడంగి మండల కేంద్రంలో డిపో వద్ద లైన్‌లో ఉన్న లబ్ధిదారులు



సర్వర్‌డౌన్ కావడంతో రాజాం మండలం గుయ్యానవలస డిపో వద్ద నిలిచిపోయిన పంపిణీ

ఘనకార్యం సాధించినట్లు హడావిడి...

ప్రజలకు పాత కష్టాలను మళ్లీ పరిచయం చేసిన కూటమి సర్కారు తామేదో ఘనకార్యం సాధించినట్లు నిస్సిగ్గుగా వ్యవహరి స్తోంది. ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టే ఈ విధానాన్ని కొంతమంది టీడీపీ నేతలు ఏదో పెద్ద ఘనకార్యం, సంక్షేమ కార్యక్రమం మాదిరిగా కొత్త వ్యవస్థలా ఆది వారం మళ్లీ అట్టహాసంగా ప్రారంభోత్సవం చేయడం విశేషం. కూటమి నేతలు హడావిడి చూసిన లబ్ధిదారులు ముక్కున వేలేసుకున్నారు. బొబ్బిలిలోని నాలుగో వార్డులోని దావాల వీధిలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు రేషన్ షాపును ప్రారంభించారు.



తెర్లాం మండల కేంద్రంలో రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో రేషన్ డిపోలు, లబ్ధిదారుల వివరాలు..		
మండలం	రేషన్ డిపోలు	లబ్ధిదారులు
బొబ్బిలి (మండలం/ మున్సిపాలిటీ)	67	1,02,061
రామభద్రపురం	33	43,886
తెర్లాం	58	42,890
బాడంగి	37	41,282
రాజాం(మండలం/ మున్సిపాలిటీ)	56	29,200
రేగిడి	66	19,600
సంతకవిటి	62	23,100
వంగర	46	14,600
	425	3,16,619

- నాలుగు గిరిజన గ్రామాలకు ఒకే చోట..



ఎరకందొర వలసలో చెట్టుకింద వేచి ఉన్న గిరిజనులు

చెట్టు కింద రేషన్ కోసం లైన్‌లో ఉన్న వీరిది బొబ్బిలి మండలం ఎరకందొర వలస. ఇక్కడ ఎరకందొర వలస, డొంగురువలస, మోసూరువలస, చిలకమ్మవలస గ్రామాలకు చెందిన వారికి ఇక్కడ రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. కానీ ఇక్కడ సిగ్నల్స్ లేవు. మొత్తం 163 రేషన్ కార్డులకు ఇక్కడే సరుకులు ఇవ్వాల్సి ఉంది. సుమారు 4 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల లబ్ధిదారులు గంటల తరబడి వేసి చూడాల్సి వచ్చింది. కొందరు సరుకులు తీసుకోగా, మరికొందరు వేచి చూడలేక మరో రోజు వద్దామనుకుని తిరిగి వెళ్లిపోయారు. ఇక్కడ రేషన్ పూర్తి స్థాయిలో పంపిణీ ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు.

గతంలో ఇబ్బంది ఉండేది కాదు..



గతంలో మా ఇంటి వద్ద రేషన్ సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్ డిపో వద్దకు వెళ్లాల్సి వస్తోంది. గతలో ఎటువంటి ఇబ్బందులు ఉండేవికాదు. ఇప్పుడు గంట సమయం నిరీక్షణ తప్పడంలేదు. సమయం వృథా అవుతుంది.

–బెవర త్రినాథరావు, వన్నలి, రేగిడి మండలం

వేరే గ్రామం వెళ్లాలి..



గతంలో మా గ్రామానికే రేషన్ సరుకులు వచ్చేవి. ఇప్పుడు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాసుదేవపట్నం గ్రామానికి వెళ్లాలి. సమయం వృథా అవ్వడంతో పాటు వేరే చోట నుంచి రేషన్ తీసుకురావాల్సిన పరిస్థితి వస్తోంది. మళ్లీ రేషన్ కష్టాలు మొదలైనట్లు కనిపిస్తుంది.

– మూడడ్ల వెంకటనారాయణమ్మ, రంగారాయపురం, సంతకవిటి మండలం

ఇష్టారాజ్యంగా నిధుల కేటాయింపు..!

- అధికారంలోకి రాగానే చాంబర్‌లకు సొగసులు అద్దుతారా..?
- రూ.5లక్షలతో చైర్మన్ చాంబర్‌కు నిధులు అవసరమా..?
- పునరాలోచించుకోవాలన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



గతంలో ఏం తప్పులు జరిగాయో చెప్పాలని చైర్మన్ శరత్‌ను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

బొబ్బిలి: అవిశ్వాస తీర్మానంతో గద్దెనెక్కిన టీడీపీ పాలకవర్గం ఆమోదంతో చైర్మన్ చాంబర్‌కు రూ.5 లక్షల నిధులు ఖర్చు చేసేందుకు అజెండాలో పెట్టి ఆమోదించడం అంత అవసరమా అంటే..కూటమి నాయకులకు అవసరమే అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అధ్యక్షతన సాధారణ, అత్యవసర సమావేశాలను ఒకేసారి నిర్వహించడం వెనుక నిధుల వినియోగానికేనన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సమావేశంలో అజెండాలను చదువుతున్నప్పుడు చాంబర్ మెరుగులు అద్దేందుకు రూ.4.98 లక్షలను వెచ్చించేందుకు నిర్ణయించామనగానే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణ(బాబు),చోడిగంజి రమేష్ నాయుడు ప్రశ్నించారు. గత నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీకి చెందిన చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు అధికారులను కుర్చీ మార్చమన్నా మార్చలేదని, ఏసీ బాగు చేయాలన్నా చేయలేదని, ఇప్పుడెలా మరి అధికారులు ఇవన్నీ చేస్తున్నారని సమావేశంలో ప్రశ్నించారు. అంతే కాదు, సాధారణ నిధులు కోటిన్నర రూపాయలు ఉన్నప్పుడు రహదారులు, కాలువల నిర్మాణం చేసి ప్రజల సౌకర్యాలు తీరుస్తామని, ఒక్కో వార్డుకు రూ.5లక్షలు కేటాయించాలని కోరినా, వీలవదని చెప్పిన అధికారులు ఇప్పుడెలా నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని, ఇందుకేనా అవిశ్వాస తీర్మానానికి ఆదుర్దాపడ్డారని నిలదీశారు. దీనికి డీఈఈ కిరణ్‌కుమార్ సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. గతంలో కౌన్సిలర్ల ప్రశ్నలకు కొంత మంది కౌన్సిలర్లు తప్ప చైర్మన్ సమాధానం చెప్పే పరిస్థితులు ఉండేవని, ఇప్పుడలా కాకుండా చైర్మన్ సమాధానమిచ్చే పరిస్థితి చూడాలని కౌన్సిలర్లు కోరగా... దానిని వినిపించుకోని టీడీపీ కౌన్సిలర్లు వాదనకు దిగడం హాస్యాస్పదంగా ఉందని, దీనిని కొత్త చైర్మన్ సవరించాలని ఒకటో వార్డు కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు కోరారు. చైర్మన్ కూడా గత పాలక వర్గంలో తప్పులు జరిగాయని నోరు జారడంతోపాటు బుర్ర లేదా అని అనడంపై.. ఏం తప్పులు జరిగాయని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిలదీశారు. దీనికి చైర్మన్ తప్పులేం జరిగాయో చెప్పలేకపోవడం కొసమెరుపు.

అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

- డీఎస్పీ భవ్యారెడ్డి

రామభద్రపురం: మాదక ద్రవ్యాలు, నిషేధిత వస్తువుల అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. మండలం పరిధిలోని కొండకెంగువ,రావివలస మధ్యలో నిర్మిస్తున్న గ్రీన్ హైవేపై పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటుకు సీఐ కె.నారాయణరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రామభద్రపురం మండల కేంద్రం అంతరరాష్ట్ర కూడలి కావడంతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలకు బోర్డర్‌లో ఉన్నందున ఈ హైవే మీదుగా గంజాయి,ఖైనీ గుట్కా,నల్ల మందు వంటి మాదక ద్రవ్యాలు, నిషేధిత వస్తు వులు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. 26వ నంబరు జాతీయ రహదారి కొట్టక్కి వద్ద పోలీస్ చెక్ పోస్టు, స్థానిక బైపాస్ రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్ఠం చేశామని, అలాగే గ్రీన్ హైవేపై కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు ఎస్ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.



గ్రీన్ హైవేపై పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటుకు పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి,సీఐ నారాయణరావు

శభాష్..రాము

రాజాం: మండలంలోని పొగిరి గ్రామానికి చెందిన స్వచ్ఛ పొగిరి సేవా సమితి అధ్యక్షుడు శనపతి రాము తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా విజయనగరం ఎస్‌వీఎస్ బ్లడ్‌బ్యాంకు వద్ద ఆదివారం రక్తదానం చేశారు. ఇప్పటికే 54 దఫాలు రక్తదానం చేసిన ఆయన 55వ పర్యాయం కూడా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. తన 18వ ఏట నుంచే రక్తదానం చేస్తున్నానని, ఏడాదికి మూడు నుంచి నాలుగు పర్యాయాలు రక్తదానం చేస్తున్నానని చెప్పారు. రక్తదానం చేస్తే ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తాయనే అపోహను యువత విడనాడాలని సూచించారు. రక్తదాత రామును మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఐ.గోపాలరావు, ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు నాగేశ్వరరావు, పొగిరి పోలినాయుడు, వాకముల్ల నాగరాజు, స్వాస్ సేవా సంఘం ప్రతినిధి బూర్లె పైడినాయుడు తదితరులు అభినందించారు. పలువురు యువకులు కూడా రాముతో కలిసి రక్తదానం చేశారు. వీరందరికీ నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు.



రక్తదానం చేస్తున్న రాము

మామకే వెన్నుపోటు పొడిచినోడికి ప్రజలోక లెక్కా..!

- వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- మాజీ ఎమ్మెల్యే శంబంగి పిలుపు



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శంబంగి, నాయకులు

బొబ్బిలి: అధికారం కోసం పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబునాయుడుకు ప్రజలొక లెక్క కాదని, ఎన్నాళ్లు పొడిపించుకుంటే అన్నాళ్లూ పొడుస్తునే ఉంటాడని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాలన్నీ మరింత మెరుగు పరుస్తూ కొత్తగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని చంద్రబాబు హామీ ఇస్తే.. నిజమేనేమోనని నమ్మిన కొన్ని వర్గాలు అధికారం అప్పగించాయన్నారు. కానీఅధికారం వచ్చిన తర్వాత పథకాల అమలుకు మీరే సలహాలివ్వాలంటూ మొహం చాటేయ డాన్ని చూసి ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. వలంటీర్లను, ఎండీఎం ఆపరేటర్లను తొలగించి, తిరిగి ప్రజలపై విద్యుత్ చార్జీల భారం, పన్నుల భారం మోపుతున్న జిత్తుల మారి చంద్రబాబు అని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం తాను ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని గుర్తు చేశారు.

గుంతలు ఎప్పుడు కప్పుతారు..?

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రోడ్లు, గుంతలు కప్పేస్తామని ఆయా రోడ్లలో సెల్ఫీలు తీసుకున్న ప్రస్తుత ఎమ్మెల్యే కనీసం గుంతలు కూడా కప్పడం లేదన్నారు. ఆయన పడుకున్నా కనపడనంత గుంతలు నియోజకవర్గంలోని రోడ్ల వెంబడి ఉన్నాయన్నారు. సిగ్గుంటే వెంటనే గుంతలు కప్పాలని, ఇందుకోసం వైఎస్సార్‌సీపీ సమావేశంలో తీర్మానం చేస్తున్నామని, ఈ అల్టిమేటంను స్వీకరించాలని శంబంగి హెచ్చరించారు.

వెన్నుపోటు కౌన్సిలర్లపై చర్యలు తప్పవు

ఇటీవల ఓ వెన్నుపోటు నాయకునితో కలిసి స్వలాభాల కోసం వెన్నుపోటు అవిశ్వాసాన్ని నెరపిన కౌన్సిలర్లపై అధిష్టానం నిర్ణయం ప్రకారం చర్యలుంటాయని మాజీ ఎమ్మెల్యే శంబంగి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అందరికీ నేను పార్టీ మారబోనని ఉదయం చెప్పి మంత్రి పదవి కోసం నిస్సిగ్గుగా సాయంత్రమే పార్టీ మారిన సుజయ కృష్ణ రంగారావు ఈఅవిశ్వాసానికి దారి తీశారన్నారు. ఆయన సోదరుడు ఎమ్మెల్యే కూడా ఇలాంటి నీతిమాలిన రాజకీయాలకు నిత్యం ఆజ్యం పోస్తునే ఉంటారన్నారు.

జూన్ 4న ఉదయం పార్టీ కార్యాలయానికి చేరుకోవాలి

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహించనున్న సందర్భంగా కార్యకర్తలు, నాయకులు అంతా ఉదయం 9 గంటలకు నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకోవాలని శంబంగి పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి మెమొరాండం అందజేస్తామన్నారు. అనంతరం వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లు, ఫ్లకార్డులను ఆవిష్కరించారు. పార్టీ పరిశీలకులు పతివాడ సత్యనారాయణ,మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీకృష్ణారావు, ఆర్థిక మండలి మాజీ రాష్ట్ర సభ్యులు తూముల భాస్కరరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, తూముల రామసుధీర్,ఎంపీపీలు శంబంగి లక్ష్మి, చొక్కాపు లక్ష్మణరావు, నర్సుపల్లి ఉమాలక్ష్మి, బాబ్జీరావు, రామభద్ర పురం బాడంగి, జెడ్పీటీసీలు అప్పికొండ సరస్వతి, పెద్దింటి రామారావు,గర్భాపు రామారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, కౌన్సిలర్లు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.